# లడఖ్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**2019** ఆగస్టు 5వ తేదీన రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటికే జమ్ముకాశ్మీర్ ప్రభుత్వ పాలనలో వివక్షకు గురౌతూ, తమను వేరుపరచాలని డిమాండ్ చేస్తూ వస్తున్న లడఖ్ ప్రజానీకం, ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని ప్రకటించారు. భూసేకరణ చట్టం-2013లో వున్న 'పరిశ్రమల భూసేకరణకు గ్రామ సభల అంగీకారం అవసరం' అనే కనీసపాటి రక్షణ నిబంధనను బిజెపి అధికారంలోకి రాగానే తొలగించింది. కార్పోరేట్ల సేవలో తరించడమంటే యిదే. జమ్మూ కాశ్మీర్ పాలకుల నుండి విముక్తి లభించిందని, ఎన్నాళ్ళ నుండో తాము కోరుకున్న డిమాండ్ నెరవేరిందని ఎగిరి గంతేసిన లడఖ్ ప్రజలకు రెండేళ్లు తిరక్కముందే అసలు విషయం అర్థమైంది.

370వ అధికరణం రద్దుతో అసెంబ్లీ కూడా లేని కేంద్రపాలిత ప్రాంతంగా లడఖ్ ఏర్పాటయింది. ఢిల్లీ పాలకులు నేరుగా లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా పరిపాలించడం మొదలు పెట్టారు. ప్రతిరోజు ఎవరెవరో తమ ప్రాంతానికి వస్తున్నారు. రోడ్లు వేస్తున్నారు. సోలార్ ప్రాజెక్టు నిర్మాణాలు అంటున్నారు. పర్యావరణరీత్యా సున్నితమైన ఈ ప్రాంతంలో కొత్త కొత్త సొరంగాలు తవ్వుతున్నారు. తమ ప్రాంత జనాభా స్వరూపం మారిపోతోంది. తమ కళ్ళ ముందే తమ సహజ వనరుల తవ్వకాలు జరుగుతున్నాయి. తమ అందమైన సున్నితమైన పర్యావరణం హిమశిఖరాలు, హిమానీ నదాలు రూపుమారి పోతున్నాయి.

వీటన్నిటినీ చూస్తున్న లడఖ్ ప్రజల్లో అశాంతి మొదలైంది. పాలక ప్రతిపక్ష పార్టీలు స్తబ్దుగా ఉన్నవేళ కొత్త ఉద్యమ నాయకులు పుట్టుకొచ్చారు. వారిలో ప్రధాన వ్యక్తి సోనం వాంగ్ చుక్. ఆయన ఒక పర్యావరణ పరిరక్షణ కార్యకర్త. ఇంజనీరు. కొత్త సాధనాల ఆవిష్కర్తగా అవార్డులు అందుకున్న వ్యక్తి. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ గ్రీన్ టీచర్‌గా పేరుగాంచిన యాక్టివిస్టు. తన ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి, హామీలు ఇచ్చి మోసగించిన పాలకుల తీరును చూసి సహించలేక ఉద్యమకారుడిగా మారాడు. 2023 జనవరిలో ఐదు రోజులు నిరాహార దీక్ష చేశాడు. 2024 ఫిబ్రవరి మూడవ తేదీన లడఖ్ రాజధాని లేలో పెద్ద ఎత్తున ర్యాలీ బహిరంగ సభ జరిగాయి. ఈ ర్యాలీలో లడఖ్‌లో ఉన్న మూడు లక్షల జనాభాలో 30 వేల మంది పాల్గొన్నారు. అంటే 10 శాతం జనాభా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత రెండేళ్లుగా ప్రదర్శనలు, ఊరేగింపులు, బందులు, ఆందోళనలు, సభలు సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కూడా ఆందోళనలు జరిగాయి. కంటి తుడుపు చర్యగా కేంద్ర ప్రభుత్వం హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ అధ్యక్షతన కమిటీని ఏర్పరచింది. ఇప్పటికి 9 దఫాలు చర్చలు జరిగాయి; ఫలితం శూన్యం. ఇవన్నీ సాచివేతకు తప్ప, సమస్య పరిష్కారానికి కాదని లడఖ్ ప్రజలకు అర్థమైంది. 21 రోజుల ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. వందలాది మంది ఆయనకు మద్దతుగా నిరాహార దీక్షలు, ప్రదర్శనలు చేస్తున్నారు.

**లడఖ్ ప్రజల డిమాండ్లు ఏమిటి?**

లడఖ్ ప్రజలు కోరుతున్నవేమీ గొంతెమ్మ కోర్కెలు కావు. లడఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతున్నారు. లడఖ్ 18,800 అడుగుల ఎత్తులో ఉన్న హిమాలయ పర్వత ప్రాంతం. లే, లడఖ్, కార్గిల్ ప్రధాన ప్రాంతాలు. లేలో బౌద్ధులు, కార్గిల్లో ముస్లింలు మెజార్టీగా ఉన్నారు. మొత్తం మీద లడఖ్‌లో నివసిస్తున్న వారిలో 97% మంది షెడ్యూల్ తెగల వారే. అందుకే వీరు తమ ప్రాంతానికి ఆరవ షెడ్యూల్లో స్థానం కల్పించమంటున్నారు. ఇది వీరి రెండో ప్రధాన డిమాండ్. లడఖ్‌కు ఆరవ షెడ్యూల్లో స్థానం కల్పించాలంటే దానికి రాష్ట్ర ప్రతిపత్తి కూడా కల్పించాల్సి ఉంటుంది. స్థానిక ప్రజలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానంతో పాటు రాజ్యసభ స్థానాన్ని కూడా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆరవ షెడ్యూల్ ప్రయోజనాలు**

6వ షెడ్యూలులో చేర్చిన ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం లేకుండా గిరిజన ప్రజలు స్వతంత్ర జిల్లా కౌన్సిల్ (ADC), స్వతంత్ర ప్రాంతీయ కౌన్సిళ్ళు (ARC) ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. అడవుల నిర్వహణ, వ్యవసాయం, గ్రామాల పట్టణాల పరిపాలన, వారసత్వం, వివాహాలు, విడాకులు, సాంఘిక ఆచారాలు తదితర అంశాలు ఈ కౌన్సిళ్ళ పరిధిలోకి వస్తాయి. వీటిపై చట్టాలు చేయడానికి, వీటి అమలుకు అధికారులను నియమించుకునే అవకాశం కలుగుతుంది. ప్రజల మధ్య వచ్చే తగాదాల పరిష్కారానికి గ్రామ కౌన్సిళ్ళు లేక గ్రామ న్యాయస్థానాలను కూడా ఈ ADC, ARCలు ఏర్పాటు చేయవచ్చు. గిరిజన ప్రజల స్వయం పరిపాలన వ్యవస్థ కొరకు 371-ఏ ద్వారా నాగాలాండ్‌కు, 371-బి మరియు సి ద్వారా అస్సాం, మణిపూర్‌లకు; 371-జి ద్వారా మిజోలకు, 371-ఎఫ్ ద్వారా సిక్కింకు, 371-ఐ ద్వారా అరుణాచల్ ప్రదేశ్, 371-హెచ్ ద్వారా గోవాకు కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. రాజ్యాంగం కల్పిస్తున్న ఈ ప్రత్యేక హక్కులు పొందడానికి ప్రస్తుతం లడఖ్ ప్రజలు తమను ఆరో షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

గత రెండు ఎన్నికల సందర్భంగా బిజెపి లడఖ్‌ను ఆరో షెడ్యూల్లో చేరుస్తానని తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. స్వయంగా హోం మంత్రి అమిత్ షా స్థానికులకు 371 అధికరణం వర్తింప చేస్తామని, స్థానిక ప్రజలకు 80% రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేశాడు. ఆ హామీలు నమ్మి లడఖ్ ప్రజలు రెండుసార్లు బిజెపికి ఓట్లు కూడా వేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తమను మోసం చేసిందని లడఖ్ ప్రజలు భావిస్తున్నారు. వాస్తవానికి ఆరవ షెడ్యూలు కొన్ని హక్కులు కల్పించిన రాష్ట్రాల్లో సైతం, కుయుక్తుల ద్వారా, ప్రజలకు భ్రమలు కల్పించడం ద్వారా, స్థానిక నాయకులను తమ వైపు తిప్పుకోవడం ద్వారా చట్టాల్లో ఉండే లొసుగులను ఉపయోగించుకుంటూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరో షెడ్యూల్ స్ఫూర్తిని దెబ్బతీసే విధానాలను అమలు చేయడం పరిపాటిగా మారింది. 1/70 చట్టాన్ని ఏ స్థాయిలో నిర్వీర్యపరిచి గిరిజన భూములను గిరిజనేతరులు కబ్జా చేస్తుంటే ప్రభుత్వాలు ఎంతటి ప్రేక్షకపాత్ర వహించాయో ఈ రాష్ట్రంలో మనందరం చూశాం; చూస్తున్నాం.

370వ అధికరణం వల్ల జమ్మూకాశ్మీర్లో భూమి రాష్ట్రేతరులకు, కార్పొరేట్లకు ఇటీవల వరకు అన్యాక్రాంతం కాలేదు; అభివృద్ధి పేరిట విధ్వంసం జరగలేదు. అదే సందర్భంలో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో అభివృద్ధి పేరిట నిర్మించిన ఆనకట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, నాలుగు వరుసల భారీ రహదార్లు – పర్యావరణాన్ని నాశనం చేసి వరదలు సంభవించటం, కొండ చరియలు విరిగిపడడం లాంటి ప్రకృతి వైపరీత్యాలకు దారితీశాయి. (ఉత్తరాఖండ్–సిల్‌క్యారాలో సొరంగం కూలి, 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయిన ఘటన ఇటీవల కాలంలోనిదే) ఈ స్థాయిలో కార్పొరేట్లు జమ్మూ కాశ్మీర్లో ప్రవేశించడానికి 370వ అధికరణం ఎంతో కొంత నిలువరించింది. దాన్ని తొలగించి మోడీ అమిత్ షాలు జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం – 2019 తెచ్చారు. ఈ చట్టం ద్వారా ఎలాంటి అడ్డంకులు లేకుండా జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలలో కార్పొరేట్ల ప్రవేశానికి మార్గం సుగమం చేశారు. వాస్తవానికి జమ్మూ కాశ్మీర్లో రాష్ట్రపతి పాలన విధించిన నాటి నుండే ఈ కార్యక్రమం మొదలైంది. జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చిన తర్వాత ఈ క్రమం నిరాటంకంగా ఊపందుకుంది.

లడఖ్‌లో అనేక సహజ వనరులు ఉన్నాయి. పూగా లోయలో; లే, కార్గిల్‌లలో మంచి నాణ్యమైన చలువ రాయి, సిమెంట్ గ్రేడ్ సున్నపు రాయి, నాణ్యమైన గ్రానైట్, ఖనిజ సంపద ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఉంది. పాషమా శాలువాల తయారీకి కావలసిన ఉన్ని ఇచ్చే గొర్రెల పెంపకం ఈ ప్రాంతంలో ఎక్కువ.

ఇప్పటికే విద్యుత్ వాహన బ్యాటరీ తయారీలో అత్యావశ్యకమైన 'లిథియం' ఖనిజ నిక్షేపాలు, కాశ్మీర్‌లోని రియాసీ జిల్లా సలాల్ హైమా ప్రాంతంలో ప్రభుత్వం గుర్తించింది. పర్యావరణరీత్యా సున్నితమైన ఈ ప్రాంతంలో విషపూరితమైన ఈ లిథియం గనులను వేలంవేసి, కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్లకు కట్టబెట్టనుంది.

480 కోట్లకు లే లేమ విమానాశ్రయ విస్తరణ, లక్షకోట్ల రూపాయల వ్యయంతో బిలాస్పూర్ రియు ఇతర రైలు మార్గాలు, 27 వేల కోట్ల రూపాయలతో లే అల్ట్రా మెగా సోలార్ ప్రాజెక్టు, 1680 కోట్ల రూపాయల వ్యయంతో లడఖ్ నుండి హిమాచల్ ప్రదేశ్‌ను కలుపుతూ 4.1కిలోమీటర్ల సింకుల్లా టన్నెల్, బిలాస్పూర్–మనాలిలే రైలు ప్రాజెక్టులలో భాగంగా 62 టన్నెళ్ళ నిర్మాణాలు, 30 వేల మంది వీక్షించేందుకు వీలుగా ఫుట్‌బాల్ స్టేడియం, 45 వేల కోట్ల ఖర్చుతో వివిధ సోలార్ ప్రాజెక్టులు, 1170 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం లాంటి ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేపట్టింది. వీటికి భూ కేటాయింపులు గాని, సహజ వనరుల తవ్వకాలకు గాని, పర్యావరణ అనుమతులకు గాని స్థానిక ప్రజల నుండి ఎలాంటి ప్రతిఘటన లేకుండా కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరిచింది. ఈ సౌలభ్యం కోసమే లడఖ్‌ను ఆరవ షెడ్యూల్లో చేర్చడం లేదనేది సుస్పష్టం.

ఇదంతా లడఖ్ అభివృద్ధి కోసం అని, పర్యాటక రంగ అభివృద్ధి కోసమని తద్వారా స్థానిక ప్రజల భవిష్యత్ తీర్చిదిద్దడానికి అనే మాయ మాటలు నమ్మే స్థితిని లడఖ్ ప్రజలు దాటిపోయారు. వాళ్ల కళ్ళముందే కనిపిస్తున్న వారి సాంస్కృతిక విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, అక్కడ జరుగుతున్న ఆర్థిక రాజకీయ నిర్ణయాలలో స్థానిక నాయకత్వానికి జీరో ప్రమేయం, తదితర అంశాలు ఆ ప్రజలను అప్రమత్తం చేశాయి. లడఖ్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజేపీకే చెందిన ఏకైక పార్లమెంటు సభ్యుడు కూడా ప్రజానిరసనలకు తలొగ్గి, తమ భూములను, ఉపాధి అవకాశాలను, సాంస్కృతిక ప్రాముఖ్యతను సంరక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేయక తప్పలేదు.

లడఖ్‌లో అడవులు లేకపోయినా అక్కడున్న గడ్డి మైదానాలు వ్యవసాయానికి, గొర్రెల పెంపకానికి అనువైనవి. అడ్డూ అదుపు లేని పారిశ్రామికీకరణ పేరిట జరుగుతున్న కార్పోరేట్ల విధ్వంసం, వారి పచ్చగడ్డి మైదానాలను హరిస్తున్నాయి. మన ప్రభుత్వం కూడా రక్షణ రంగ మౌలిక వసతుల పేరిట చేపడుతున్న నిర్మాణాల వల్ల గడ్డి భూములు హరించుకు పోతున్నాయి. 2019 తర్వాత ప్రభుత్వ రంగంలోని ఒక్క ఉన్నత ఉద్యోగం కూడా స్థానికులతో భర్తీ కాలేదు. వీటన్నిటిని బయట వ్యక్తులతోనే నింపుతారని లడఖ్ స్టూడెంట్స్ ఎన్విరాన్మెంటల్ యాక్షన్ ఫోరం (LSEAF) ఆందోళన వెలిబుచ్చుతోంది.

2019కి ముందు కార్గిల్ ప్రాంతంలో ఉన్న ముస్లింలు కార్గిల్‌ని జమ్మూకాశ్మీర్లో విలీనం చేయాలని డిమాండ్ చేసేవారు. లే, లడఖ్ ప్రాంతాలలోని బౌద్ధులు తమను కాశ్మీరుల పాలన

నుండి విముక్తులను చేసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసేవారు. కానీ ఇప్పుడు ఇరువురు ఏకమై లే ఎపెక్స్ బాడీ (ABL), కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్ (KDA)ల ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమిస్తున్నాయి. 2024 మార్చి 6వ తేదీ నుండి మైనస్ డిగ్రీల చలిలో ఆరు బయట కేవలం ఉప్పు నీళ్లు మాత్రమే తీసుకుంటూ 25 రోజులు నిరాహార దీక్ష నిర్వహించారు. కార్గిల్ డెమోక్రటిక్ ఫ్రంట్ కూడా ప్రత్యేకంగా మూడు రోజుల నిరాహార దీక్ష చేపట్టింది. వేలాదిమంది ప్రజలు ఈ ఉద్యమాల్లో పాల్గొంటున్నారు.

ఇది దేశంలో ఒక్క లదఖ్ ప్రజల సమస్య మాత్రమే కాదు. ఛత్తీస్‌గడ్‌లోని 1,70,000 హెక్టార్ల హసియో ఆనంద్ అడవులను బొగ్గు క్షేత్రాల కోసం నిర్మూలించబోతున్నారు. వజ్రాల గనుల తవ్వకం కోసం మధ్యప్రదేశ్‌లోని బక్స్‌వాహ అడవులను నరికి వేయడానికి ప్రయత్నిస్తున్నారు. పర్యావరణాన్ని, ప్రత్యేకించి– వృక్ష సంపదను నిర్మూలించే దిశగా లక్షదీవుల గవర్నర్ ప్రఫుల్ల కోడాపటేల్ అప్రజాస్వామిక విధానాలను చేపడుతున్నారు. ఇవన్నీ కార్పొరేట్ల దాహాన్ని తీర్చడానికి బిజెపి అనుసరిస్తున్న విధానాల్లో భాగమే. ఈ విధానాలకు అడ్డొచ్చిన ఉద్యమ శక్తులను నిర్దాక్షిణ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయి. అయినా ఆయా ప్రాంతాల్లో ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. ప్రధానస్రవంతి మీడియా ఆ ఉద్యమ వార్తలను బయట సమాజానికి తెలియకుండా మింగేస్తోంది. ఇలాంటి వాతావరణంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యమిస్తున్న ప్రజలు ఐక్యమై దేశ స్థాయిలో ఆందోళనలు చేపట్టినపడు మాత్రమే కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలను ధీటుగా అడ్డుకోగలుగుతారు.

* * * * *